# గిరిధామం

కన్నడమూలం: అనుపమానిరంజన

అనువాదం: కల్యాణి



సూర్యుని లేతకిరణాలు పచ్చటికొండకు వింత అందాన్నిస్తున్నాయి. చల్లటిగాలి అలలు అలలుగా వచ్చి ఓమారు అలా పలకరించి పోతోంది. వంకరటింకరగా ఉన్నరోడ్డు. ఎవరో నడుముకు బిగించిన వడ్డాణంలాగా ఆ గిరిని చుట్టి, లోయలోకి దిగి, చుట్టూ ఉన్న పచ్చటి వనలక్ష్మిని చూసి పక్కుమని నవ్వి, మామిడిచెట్టుకింద మొహం దాచుకుంది. బృహదాకారపు ఎరుపు, తెలుపు రంగుల రాళ్ళరాశి ఓ వేపునయితే, మనమోహనాకారంగా వెలుగు కిరణాలతో దాగుడుమూతలాడుతున్న పచ్చటి చెట్లు ఇంకోవేపున. క్రీగంటితో చూసే పూలు కొన్నయితే, పూర్తిగా కళ్ళుమూసుకునే ఉన్నవి మరికొన్ని. విశాలనేత్రాలతో పలకరించేవి మరికొన్ని. ఎన్నోరకాలు. రంగు రంగుల పూలు! నీలాకాశం చేతికందుతుందేమో అనుకుంటూ చూపు పక్కకు మరలిస్తే అంతుకనబడని పాతాళం గుండెల్లో గుబులును పుట్టిస్తుంది.

గిరిధామానికి బస్సులో వెడుతున్న ప్రయాణీకులకు విభిన్నస్వరాల సమ్మేళనాన్ని వింటున్న అనుభూతి కలుగుతుంది. ప్రకృతి అందాలు కొంతమందిని తృప్తిపరిస్తే, మరికొందరికి విసుగుని తెప్పిస్తోంది. మరికొంతమందికి కడుపు త్రిప్పటను తెప్పించి, సీటుకు చేరగిలబడి కూర్చునేలా చేస్తోంది. సంతోషం, పునీతమయిన భావన, విరాళ, బాధ వీటి స్వరమేళానికి ఆబస్సు బ్యాండ్‌మాష్టరయింది.

కిటికీలోంచి మొహం బయటికి పెట్టి చూస్తున్న లలితమ్మ.

"అబ్బ! ఎంత బావుందండీ!" అన్నారు ఆనందాతిరేకంతో.

విశ్వేశ్వరయ్యగారి మొహంలో అసహనపు చిహ్నాలు కనిపించాయి. ముక్కుమీదున్న కళ్ళజోడుకూడా ఓ మారు విసుగ్గా కదిలింది చిరాగ్గా.

"కాస్త ఊరికే కూర్చోకూడదూ" అన్నారాయన.

తనకు కడుపులో తిప్పుతోంది. వీపు నొప్పెడుతోంది. దీన్లో అందమేమిటి, నా మొహం, అనుకున్నారాయన. వంకరరోడ్డుమీదుగా చుట్టిచుట్టి పైకివెడుతున్న ఈబస్సు ఓమారు ఆగకూడదూ. బయటికిదూకి నడుం నేలమీద వాల్చవచ్చునే అనిపించింది ఆయనకు. మంచంమీద పడుకునీ పడుకొనీ విసుగువేసింది. నిజమే. అయినా నేలమీద పడుకోవాలన్న ఆశ. ఎన్నిరోజులు? రోజులుకాదు, నెలలు. దగ్గు, జ్వరం, వీపునొప్పి ఒకదానివెనుక ఒకటి. ఏదో చిన్నజబ్బులే, పోతుంది అని నిర్లక్ష్యం చేశాడతను. పగలల్లా కూర్చునిరాసే అకౌంటెంట్ పని అతనిది. వీపునొప్పి కాక మరే మవుతుంది? కాని ఇంకాచేస్తే తన్ని పట్టుకున్నది ఓ బ్రహ్మరాక్షసే. పరీక్షచేసిన డాక్టరు "ఇన్ని రోజులు ఏంచేశారు" అని దబాయించాడేం! ఇంకా ఇప్పుడే మీసాలువస్తున్న కుర్రాడు. నాగరాజ్ ఈడువాడే తనకెంత కోపంవచ్చిందా

రోజున! అంతా మ్రింగి ఊరుకున్నాడు. చేదు మందు మింగినట్టే! ఆ ఇంజక్షన్‌లకొక లెక్కా జిక్కా ఉందా? ఆఖరికి తనవంట్లో సూది గుచ్చని చోటే లేదు. ఈ డాక్టర్లు క్రూరులు. నరభక్షకులు. ఆఖరికి తన వీపుకూడా కోశారు కదా! బోన్ టి. బి. అట వాళ్ళ మొహం. ఎక్స్‌రేతీసి అటూఇటూచూసి, ఏదో నిధి దొరికిన వాళ్ళలాగా నవ్వి "ఓ. ఇక్కడుంది ఈ ఎముక పాడయింది. ఇదిగో చూడండి" అన్నారు. తను తలగోక్కుని, కళ్ళజోడు వెనుక కళ్ళను పెద్దవి చేసి చూసినా తెలుపునలుపుల పిచ్చిఫొటోతప్ప పాడయిపోయిన ఎముక కనబడలేదు. అయినా ఆపరేషన్ చేశారు. "ఇహ గెల్చారు మీరు" అన్నారు. ఇదంతా పాతకథ ఓ రెండ్నెలయ్యాక "ఓ రెండువారాలు గాలిమార్పుకోసం ఎక్కడకయినా వెళ్ళిరండి" అని ఆదేశం ఎవరిక్కావాలి. ఇదంతా? ఈ ముసలితనంలో ఇదంతా పిచ్చి కాక మరేమిటి? వద్దుఅంటే లలిత కంట నీరు పెట్టుకుంది. నాగరాజు, అంబిక ఒకటే మొండి పట్టు పట్టారు. "మీ ఆరోగ్యం ముందు బాగు పడాలి నాన్నా" అని బ్రతిమాలుకున్నారు. ఒక్కళ్ళకీ బుద్ధిలేదు.

"ఓ కుదుపుతో బస్సు ఆగి కునుకుతున్న విశ్వేశ్వరయ్యగార్ని లేపింది. హడావిడిగా లేచి సీటుకిందపెట్టిన బ్యాగు నెత్తుకోగానే లలితమ్మ

"ఇటివ్వండి దాన్ని" అంటూ లాక్కున్నారు.

ఆమెవంక కోపంగాచూసి, ముందున్నవారిని తోసుకుంటూ కిందికిదిగి జారిపోయిన పంచ అంచును పైకి కట్టారు బస్సుపైకెక్కిన కండక్టరు దించిన సామాన్లసంచిని అందుకుని కూలీని పిల్చారు.

అద్దెకు తీసుకున్న గది అరగంటలో శుభ్రం చేసి. స్టౌ వెలిగించి కాఫీ చేశారు లలితమ్మ. అలసిన శరీరానికి కాఫీవాసన మత్తుగా అనిపించింది. పేముకుర్చీలో కూర్చున్న విశ్వేశ్వరయ్యగారికి కాఫీకప్పు అందిస్తూ లలితమ్మ.

"కాఫీ తీసుకోండి" అన్నారు.

పాతికేళ్ళక్రితం అదే రకంగా కాఫీ అందించిన యువతి లలితను తల్చుకుని ఆయన వళ్ళు పులకరించింది. తన మొహంలోని సంతోష చిహ్నాలను భార్య గమనించవచ్చు ననుకోగానే ఆయన మొహం మళ్ళీ బిగుసుకుంది. అప్పుడే చిన్నతలం అనుభవాలను నెమరేసున్న లలితమ్మ నిట్టూరుస్తూ మెల్లిగా అన్నారు.

"ఆ నాటికీ ఈ నాటికీ ఎంత మారిపోయారు మీరు!"

అవును. ఆనాడు ఉత్సాహం, అహంభావాలు నిండివున్న యువకుడు తను. ప్రపంచాన్నంతా జయించగలనన్న నమ్మకం ఉండేది. ఇంటర్ ఫేలయి గుమస్తా ఉద్యోగంలో చేరిన తన తల



మహా దుర్భిక్షం    ఫొటో: సి. ఎస్. రావు, భోపాల్

రాత కట్టటానికి ఎన్నోరోజులు పట్టలేదు. నాగరాజు పుట్టాడు. మొదటిబిడ్డ అన్న హడావిడి. ఆ తరువాత లలితకు ఏడెనిమిది అబార్షన్స్. ఈ జీవితం చాలునురా బాబోయ్ అనిపించిన రోజులవి. ఇల్లువదలి హిమాలయాలకు పారిపోయి సన్యాసవుదామని అనుకున్న రోజులవి. చిరిగిన గుడ్డలు. నిండని కడుపు. తీరని ఆకలి తన్ను అసంతృప్తుడిగా చేసింది. నవ్వుతున్న మొహం చిటపటలాడింది. అది తిరస్కారపు రంగుల్ని రంగరించుకుంది. మొహంమీద కాఠిన్యపు రేఖలు స్థిరంగా నిలబడ్డాయి. అప్పుడే అంబిక పుట్టింది. తన ముద్దులగుమ్మ. ప్రేమ సాగరం. దానిలో స్నానంచేసి లేచినపుడు మొహం పరిశుభ్రమయ్యేది. బయటి ప్రపంచం లోకి దిగగానే మళ్ళీ బాధలు. బిగుళ్ళ ప్రత్యక్షం.

మొహం కడుక్కుని, తల దువ్వుకుని వచ్చిన లలితమ్మ.

"అలా బయటికి వెళ్ళివద్దామాండి. వంటకింకా బోలెడంత టైముంది. మనిద్దరమే కదా." అన్నారు.

తనకైనా వేరేపనేముంది, బ్యాంకు లెక్కలా. ఇంటి తాపత్రయాలా? పిల్లల భవిష్యత్తును గురించిన ఆలోచనలా?

విశ్వేశ్వరయ్యగారు జోళ్ళు తొడుక్కుని భార్యతో బయలుదేరారు.

చల్లటిగాలి సుస్వన-నినాదం. ఆకాశన్నంటే వృక్షాల మర్మరలు. జనసంచారంలేని దార్లు. అక్కడక్కడా ఎక్కటానికి రాళ్ళమెట్లు. రాలిపోయిన పసుపు. ఎరుపు. పచ్చటిరంగుల ఆకులు, కొమ్మలు, చెట్టెక్కి కూచున్న కోతులు, "కుహూ" "కుహూ" అని పిలిచే కోయిలలు.

"పిల్లల్ని పిల్చుకొస్తే బావుండేది."

అవునన్నది అతని హృదయంకూడా. పిల్లలు అంబికా, నాగరాజు ఇద్దరే. కాని వారి జీవితాల్ని సరిగ్గా చక్కదిద్దటానికి కాలేదు తనచేత. అదే బెంగ. నాగరాజు తొందరగా ఎదిగివచ్చాడు. ఒకటి రెండుమార్లు ఫేలయినా ప్రీ యూనివర్సిటీ పాసయ్యాడు వాడిని డాక్టర్ని చేయాలన్న కోరిక తనది. ఇంజనీరయితే చూడాలన్న ఆశ తల్లికి. కాని వాడికి సీటు ఇచ్చేదెవరు? ఎక్కడికి వెళ్ళినా డబ్బు. డబ్బు తనో తిండికి గతిలేని పేదవాడు. అప్పుచేసి. కాళ్లుపట్టి వేడుకోనా? హుం! ఏదీ పనికిరాలేదు. అన్ని ప్రయత్నాలు బూడిదలోపోసిన పన్నీరయ్యాయి. ప్రపంచాన్నే ఆపోశనం తీసుకుని నాశనం చేయాలన్నంత క్రోధంవచ్చింది తనకు. పేదవాడి కోపం పెదవికి చేటు.

"నాగరాజుడికి ఈమారయిన ఉద్యోగం దొరుకుతుందా?"

చడీచప్పుడూ లేకుండా తేలు కుట్టినట్టయింది.

"ఎవరికితెలుసు? నేనేమయినా జ్యోతిష్కుడ్నా?"

"అబ్బాయి బి. ఎస్సీ పాసయి రెండేళ్ళవచ్చింది. వాడి రాతలో ఉద్యోగం దొరుకుతుందని దేవుడు రాశాడోలేదో!" ఆమె నిటూర్పు గాలిలో కలిసిపోయింది.

"నోర్మూసుకుని వస్తావా. రావా నువ్వు?"

నిప్పులు చెరిగిన ఆ మొహం దిగంతాన్నే

ఇంటికి దీపం కంటికి వెలుగు
"ఆంధ్రజ్యోతి"
సచిత్ర వారపత్రిక చదవండి!

సచిత్ర
హిందీ-తెలుగు కోష్

3500 Words Idieoms & Proverbs
"గ్రంధకర్త"
చావలి సూర్యనారాయణమూర్తి. M.A., P.H.D.

ఈ డిక్షనరీ హిందీభాష చదువుకొను విద్యార్థులకు కల్పతరువు. హిందీ భాషాజ్ఞానము సంపాదించుటకు ఈ కోష్ ఎంతో ఉపయోగకరము హిందీ కఠినపదములకు సులభముగా అర్థమగునట్లు అక్కడక్కడబొమ్మలు చేర్చబడియున్నది ఈ డిక్షనరీ ముచ్చటైన మూడవ కూర్పు సుమారు 700 వందల పుటలుగల పుస్తకము. With Jacket. వెల. 7–50.
పోస్టేజి అదనము.

హిందీ-తెలుగు స్వబోధిని

హిందీభాషను అతి సులభముగా 30 దినములలో నేర్చుకొనవచ్చును. ఇందులో హిందీ పదములకు తెలుగు అర్థములు. తెలుగు పదములకు హిందీ అర్థములు నేర్చుకొనుటకు సులభముగా వ్రాయబడినది. ఇందులో కథలు. వ్యాసములు. వ్యాకరణము. ఉత్తరములు వ్రాయు పద్ధతి మున్నగు విషయములు కలవు.
వెల: రు. 2–25. పోస్టేజి వేరు.

అశోక
ఆంగ్లేయబోధిని

పిన్నలకు. పెద్దలకు ఉపయోగకరము. అక్షరాభ్యాసము రానివారుకూడా మా ఆంగ్లేయ బోధిని సహాయంతో 60 దినములలో ఆంగ్లము నేర్చుకొనవచ్చును. బాలబాలికలకు చాలా సహాయపడును. మా ఆంగ్లేయబోధినిలో ఇంగ్లీషుకు ఉచ్చారణ పలుకురీతి తెలుగులో వ్రాయబడియున్నది. దీనిలో ఇంగ్లీషుకు తెలుగులో గ్రామరు వ్యాసములు ఉత్తరములు వ్రాయుట సామెతలు. కథలు మున్నగు విషయములు చక్కగా సులభ శైలిలో యున్నది. సుమారు 600 పేజీలుగల పుస్తకము. పోస్టేజీ అదనం వెల. రు. 6–00.

బాలసరస్వతీ బుక్‌డిపో, మద్రాసు-1.

## గిరిధామం

తదేకంగా చూసింది. ఎండ తీవ్రతరమయింది. ఇద్దరూ మళ్ళీ గదివేపు అడుగులువేశారు.

లలితమ్మ వంటమొదలెట్టినప్పుడు. విశ్వేశ్వరయ్యగారు "కృష్ణావతారం" పుస్తకాన్ని పట్టుకుని బయటికివచ్చారు. గదికెదురుకుండా. పచ్చటి తివాచీని పరిచి పచ్చి. ఎర్రటిచిగుళ్ళతో. పెద్ద కొమ్మలు- రెమ్మలతో. చల్లటినీడనిచ్చే చెట్టు ఆకర్షణీయంగా కనబడింది. దాన్ని ఆనుకుని కూర్చొని పుస్తకం పుటలు తిప్పారు విశ్వేశ్వరయ్యగారు.

రాధ-కృష్ణుడు.
అంబిక-రాజీవుడు.

ఈరోజు తన మనస్సంతా అటువేపే మళ్ళుతున్నదేమో అని ఆశ్చర్యంవేసిందాయనకు. రాజీవుడి పేరు వింటేచాలు ఒళ్ళుమండేది ఆయనకు. 'నాయింటిగడప తొక్కకు" అని ఎన్నోమార్లు తిట్టారతన్ని. కాని దొంగకృష్ణుడిలాగే తను లేనప్పుడు వచ్చివెడుతూంటం. తనకు మాత్రం తెలియదూ? అదంతా లలిత చేసినదే అనుకున్నారాయన.

అంబికకూడా చిన్నపిల్లకాదు. ఆ వయసుకు సహజమయిన కోరికలతో వేగిపోతోందనికూడా తెలుసును. తండ్రిగా తనబాధ్యత తనకుతెలియదా? అమ్మాయి పెళ్ళిగురించి చింత తనకులేదూ? ఎన్నిచోట్ల ప్రయత్నించాడు తను. ఎంతమంది కాళ్ళుపట్టుకున్నాడు, ఈ నాలుగేళ్ళగా. అయినా మిగిలినది నిరాశే.

"మా అన్నయ్యకొడుకు రాజీవుడున్నాడుగా. అతనికేం తక్కువండీ?"

"ఏమీలేదు. బొమ్మలు గీసుకునేవాడికి పిల్లనివ్వనా?"

"బొమ్మలువేసుకునేవాడని అంత చులకనా మీకు? బంగారంలాంటి కుర్రాడు. అంతా అన్నయ్య పోలికే. దానికెందుకంత ఈర్ష్య మీకు?"

"దానితో కడుపునిండదులలితా, గుర్తుంచుకో"

కాని రాజీవుడి పేరెత్తగానే వెలిగే అంబిక మొహాన్నెలా తోసిపారెయ్యగలడు? ఆమెకోర్కెను తొక్కిఉంచటం సాధ్యమయ్యే పనేనా? తాను వద్దన్నా అంబిక రాజీవుడ్నే పెళ్ళాడతానని పట్టుబడుతుందా? నేను ఎంచి తెచ్చిన వరుడ్ని ఎదురు చెప్పకుండా చేసుకుంటుందా? పిల్లలు పెద్దలు చెప్పినమాట వింటేనే అందమూ చందమూను.

అడుగుల చప్పుడుతో తలెత్తి చూశారు విశ్వేశ్వరయ్య. లలితమ్మ వచ్చి గడ్డిమీద భర్త పక్కనే కూర్చుంటూ.

"భోజనానికి వస్తారా?" అన్నారు.

"ఊఁ".

భర్త మొహం ప్రసన్నంగా ఉండటాన్నిచూసి లలితమ్మ మృదువుగా అడిగారు.

"మన అంబిక విషయం ఏం నిశ్చయం చేశారు?"

"ఏముంది? మంచి సంబంధం చూద్దాం."

"అదికాదు నే నడుగుతున్నది. రాజీవుడి సంగతి......"

"ఆ మాట ఎత్తొద్దని ఎన్నోమార్లు చెప్పాను కదా?" అంబిక ఎప్పటికీ రాజీవుడి భార్య కాలేదు!"

అగ్గిపుల్ల గీయగానే మంట భగ్గుమని అంటుకుంది. ఆ మంటలో లలితమ్మ మొహంమాడి మసిబొగ్గయింది. "ఈయనకెందుకో రోజురోజుకూ కోపం ఎక్కువవుతోంది. ఇది ఎక్కడిదాకా వెడుతుందో ఏమిటో" అని గొణుక్కుంటూ పెద్దగా అడుగులేస్తున్న విశ్వేశ్వరయ్యగార్ని అనుసరించారు.

తేట చారు. అన్నపు భోజనం. అయినా రుచిగా ఉంది. భోజనాలయ్యాక మాత్రలు. టానిక్ పుచ్చుకున్నాక నిద్ర ముంచుకువచ్చింది ఆయనకు.

• • •

సాయంకాలపు షికారు ఎంతో ఆనందదాయకంగా ఉంది. పడమటి దిక్కునుండి వస్తున్న సూర్యకిరణాల పచ్చటి తీగలమీద పడి సప్తవర్ణపు ఇంద్రధనుస్సును సృష్టించింది. ఓ వేపున బంగారువన్నె అందచందాలు. మరో వేపున అరుణవర్ణపు సౌందర్యం. మౌనంగా నిల్చున్న నల్లటికొండలు మబ్బుల్ని చూస్తున్నాయి. వాటినిచూస్తూ నిర్వికారంగా ఓ రాతి బెంచీపైన కూర్చున్నారు విశ్వేశ్వరయ్యగారు. ఏఆలోచనలూ లేకఇలా కాలంగడపగలిగితే ఎంత బావుండునని ఓ క్షణం అనిపిస్తే మరోక్షణం పనిలేకపోతే మనిషి ఎందుకూ పనికిరాకుండా అయిపోతాడు అనిపించేది.

అప్పుడే తెల్లటి ఖాదీ బట్టలువేసుకుని, చేతిలో ఓ కర్రపట్టుకున్నతను ఆయన దగ్గరకువచ్చి అదే బెంచిమీద కూర్చున్నారు. పచ్చటి ఛాయ, వెడల్పయిన మొహం, ప్రకాశవంతమయిన కళ్ళు, ముడతలుపడిన మొహం, తెల్లబడిన వెంట్రుకలున్న ఆ వ్యక్తి ఆయనవేపు ఓమారు చూసి మళ్ళీ దిగంతంవేపుకు దృష్టి మరల్చారు.

సూర్యుడు పశ్చిమ సముద్రంలోకి దిగుతున్నాడు. తెల్లటి మబ్బులు ఎరుపురంగును రంగరించుకున్నాయి. మరుక్షణంలోనే అది బంగారువన్నె అయింది. లేతపసుపు, తెలుపు రంగులు సూర్యకిరణాలను తమ అరచేతిలో దాచి ఉంచుకుని నల్లటితెరను పరిచాయి.

అంతవరకూ మౌనంగా కూర్చున్న ఆ ముసలాయన

"ప్రకృతి సౌందర్యం ముందు మనిషి ఎప్పటికీ పనిపాపేకదూ?" అన్నారు.

"అవునేమో" అన్నారు విశ్వేశ్వరయ్య తిరస్కారంతో.

"దీన్నిచూస్తుంటే "ఇంకా కావాలి" అని

పిస్తుందితప్ప "చాలు బాబోయ్" అని అనిపించదు"

"నాకు బాధనవిపిస్తుంది. మన కడుపును గురించిన బాదే మనకెక్కువగా ఉండే ఈ ప్రకృతి అందచందాల్ని కట్టుకుని ఏం చెయ్యను ?"

ఆ ముసలాయిన ఆశ్చర్యంతో విశ్వేశ్వరయ్య గారివేపు చూసి

''ఇది హృదయపు దాహాన్ని తీరుస్తుంది మిస్టర్... ?"

''నా పేరు విశ్వేశ్వరయ్య. మీది ?"

''రాజారావ్ అంటారు నన్ను" చిరునవ్వుతో చెప్పారు ఆయన.

చీకటి ప్రపంచాన్ని క్రమ్ముకోసాగింది. దాంతో పైకి లేచారు. మౌనంగా నడవసాగారు. ఆకాశంలో చంద్రుడు చల్లటివెన్నెలవిగాస్తున్నాడు. పాలనురగలాంటి వెన్నెల చెట్లసందుల్లోనుండి తొంగిచూసి చిరునవ్వు నవ్వింది. అతనే ముందు మాట్లాడనీ అన్న అహంభావం విశ్వేశ్వరయ్య కయితే. ప్రకృతి సౌందర్యంలో మైమరచి. విచిత్రమైన శాంతి దొరికిన అనుభూతితో ఇక మాట్లాడలేకపోయారా వృద్ధులు.

మరుసటిరోజు సాయంకాలం ''విచిత్రమైన వ్యక్తి" అనుకుంటూ ముందురోజు కూర్చున్న చోటికి వచ్చేటప్పటికే రాజారావుగారు వచ్చి కూర్చున్నారు.

"రండి, రండి" అంటూ ఆహ్వానించా రాయన.

"ఇక్కడికి మీ రొక్కరే వచ్చినట్టున్నారు" అంటూ మొదలెట్టారు విశ్వేశ్వరయ్య.

"అవును. ఒక్కడినే వచ్చాను, మాదిదుర్గం అక్కడ మా అన్న కొడుకూ. వాడి భార్య పిల్లలూ ఉన్నారు. వాళ్ళే భూముల్ని చూసుకుంటారు. నాకే ఎందుకో ఓ రకమయిన అసంతృప్తి. అశాంతి, ఇలాగే చుట్టుకుని వద్దామని బయల్దేరాను. ఈ గిరిధామంలో నేను వెతుకుతున్నది కనబడింది."


"ఏమిటది ?" కుతూహలంతో అడిగారు విశ్వేశ్వరయ్య.

"శాంతి, నా మనశ్శాంతి"

ఇతనుపిచ్చివాడే అనుకున్నారు విశ్వేశ్వరయ్య ఒంటరిగా తిరుగుతూ, ఈ అడవిలో శాంతి దొరికింది అనే ఈ ముసలాడికి నిజంగానే పిచ్చెక్కింది అవిమరోమారు అనుకున్నారాయన కాని రాజారావుగారు అలౌకికమైన ఆనందంతో ఆ కొండల్ని, లోయనీ, మైదానాల్లో బొమ్మల్లా కనిపిస్తున్న పల్లెల్ని చూస్తూండటాన్ని గమనించి విశ్వేశ్వరయ్య లేచారు.

''మా ఆవిడ నా కోసం ఎదురు చూస్తూంటుంది. వస్తాను."

''ఓ ! మీరు జంటగా వచ్చారా ? అదృష్టవంతులు."




ఆతని నిట్టూర్పు గాలిలో కలిసి గిరికందరాలకు పయనించింది.

లలితమ్మతో రాజారావుగారి విషయం చెప్పగానే ఆమె "నేనూ ఆయన్ను చూశాను. చూడగానే గౌరవం పుడుతుంది. ఆ పిల్లవాళ్లు చాలా డబ్బున్నవారని చెప్పింది" అన్నారు.

మరుసటి రోజు సాయంకాలం వద్దనుకుంటూనే అదే చోటుకే వెళ్లారాయన. ఆయన్ను చూడగానే రాజారావుగారు చిరునవ్వు నవ్వారు. కూర్చుంటూ విశ్వేశ్వరయ్యగారు.

"దేవుడు కష్టాలన్నింటినీ ఒక్కడికే ఇస్తాడనిపిస్తుంది. మీరేమంటారు? అనడిగారు.

''ఎవరికన్ని కష్టాలిచ్చాడు?"

"నాకు ఈ జీవితంలో నేననుభవించినవన్ని కష్టాలు మరెవ్వరూ అనుభవించి ఉండరు."

"ఎవరి కష్టం వారికి పెద్దగా అనిపిస్తుంది."

విశ్వేశ్వరయ్యగారు తమ రోగపు చరిత్ర నంతా వివరంగా వర్ణించి ''ఇప్పుడు చెప్పండి. నాకన్నా కష్టాలు ఎవరయినా......"అన్నారు.

''బ్రదర్. మీకు విసుగనిపించకపోతే నా లైఫ్ గురించి చెప్పనా?

విశ్వేశ్వరయ్యగారు రాజారావుగారివైపు తిరిగి కూర్చున్నారు. సూర్యుడి బంగారు కిరణాలు ఆయన మొహం మీదపడి వెలుగుతున్నాయి.

''మాది కొంచెం బాగా డబ్బున్న కుటుంబమే. కష్టమంటే ఏమిటో తెలీకుండా పెరిగాను. పెళ్ళయింది. ఇద్దరు పిల్లలు పుట్టారు. ఓ అమ్మాయి, ఓ అబ్బాయి, భార్యను చాలా ప్రేమలో చూసుకునేవాడ్ని ఆమెక్కూడా నేనంటే ప్రాణం. ఇంత చక్కటి కాపురాన్ని చూసి విధికి కన్నుకుట్టిందేమో! ఓమారు అబార్షన్ అవటంతో ఆవిడ దేవుడి పాదాలు చేరుకుంది. కష్టపడి పిల్లల్ని పెంచాను. అమ్మాయి పెళ్ళీడుకు రాగానే మంచి సంబంధం కుదిర్చాను.

అప్పుడే అమ్మాయి నాదగ్గరకొచ్చి "నాకు పెళ్ళి వద్దునాన్నా" అంది. దాని మనసులో ఏముందో నాకెలా తెలియాలి? పెళ్ళి ఇంకో వారముందనగా ఎవరికి తెలియకుండా నూతిలో దూకి ప్రాణాలు తీసుకుంది. ఎందుకలా చేసిందో ఆ దేముడికే తెలియాలి..."

ఆ మాట చెబుతూంటే రాజారావుగారి గొంతు గద్గదమయింది, రెండు చేతులలోనూ మొహం దాచుకున్నారు.

ఒక్క నిమిషం భయంతో వణికిపోయారు విశ్వేశ్వరయ్యగారు. అంబికకూడా అలాగే చేస్తుందేమో, వద్దని ఖచ్చితంగాచెబితే ఆ పిల్లలాగే ప్రాణాలు తీసుకుంటే? ఛ, అంబిక ఎప్పటికీ అలాచేయదు. బుద్ధిమంతురాలది అనుకున్నారు.

''నిజానికి నా కదృష్టం లేదంటే, అమ్మాయి గతి ఇలాఅయ్యాక నాకు జీవితంలో ఆసక్తి నశించిపోయింది. అబ్బాయి- చదువుకుని ఇంజినీరయ్యాడు. ఉద్యోగంకూడా దొరికింది. ఉన్నట్టుండి 'కడుపునొప్పి" అన్నాడు. డాక్టరు దగ్గరకు పరిగెత్తాం. అందరూ పరీక్షచేశారు. ఎక్స్‌రే తీశారు, రక్తం పరీక్షించారు. స్పెషలిస్ట్స్ అందరూకలిసి బుర్రలు బద్దలుకొట్టుకున్నారు. ఆఖరికి ప్రేగు ఏదో ముడి పడిందన్నారు. కడుపు కోశారు. నేను అలా చూస్తూండగానే. నా కళ్లెదుటే అబ్బాయికూడా చనిపోయాడు. నేనేమయి ఉండాలి ఊహించుకోండి. నా ఇల్లు కాలి మసి అయిపోయింది. భార్య చనిపోయింది పెంచి పెద్దచేసిన పిల్లలు నన్నొదిలి వెళ్ళిపోయారు. ఎవరికోసం బ్రతకాలి అని చచ్చిపోదామనుకున్నా. ఏదో అదృశ్యశక్తి నన్నింతవరకూ జీవించేలా చేసింది. అప్పటినుండి ఈ రోజు

(39 వ పేజీ చూడండి)

# గిరిధామం

(27 వ పేజీ తరువాయి)

వరకూ ఇక్కడే నాకు మనశ్శాంతి దొరికింది మీరు దీన్ని నమ్ముతారో లేదో ?"

శ్మశానమౌనం ఆవరించింది. చీకటి పడి టాన్ని కూడా గమనించకుండా... అక్కడే కూర్చున్నారిద్దరూ. విశ్వేశ్వరయ్యగారి మనస్సు జాలితో నిండిపోయింది. అన్నింటినీ పోగొట్టుకున్న ఈ విరాగిముందు తన కష్టాలు. త్యాగం అంతా తృణప్రాయమే నని పించిందాయనకు.

ఆ రోజు రాత్రి భోజనాలయ్యాక బయట గడ్డిమీద తివాచీ వేసుకుని అక్కడే చాలాసేపటి వరకూ కూర్చున్నారు. ఆకాశం చుక్కలు మెరుస్తున్నాయి. దూరాన పల్లెలో దీపాలు. నక్షత్రాలు కింద పడ్డాయేమో ననిపించేలా ఉన్నాయి. పలానా అంటూ దేన్నిగురించీ ఆలోచించక పోయినా ఎందుకో ఆందోళనగావుంది.

• • •

అందంగా తెల్లవారింది. గడ్డిమీద మంచు బిందువులు మెరుస్తున్నాయి. నాలుగడుగులుంటత దున్నదేదీ కనిపించటంలేదు. ప్రకృతి తెల్లటి మంచుతెర వేసుకుంది. విశ్వేశ్వరయ్యగారు శాలువా కప్పుకుని తలుపుదగ్గరకువచ్చి నిలబడ్డారు. అరుణ రాగానికి శృతిచేసింది తూర్పుదిక్కు. నెమ్మదిగా తొంగిచూసిన అరుణకిరణం. కొంత సేపటిలోనే తీక్షణమయి. తెల్లటి మాయాదండంగా మారి మంచుతెరను తొలగించింది. దానివెనకాల రూపుదాల్చిన లోయ మనమోహనంగా ఉన్నది. దాన్ని చూస్తుంటే ఏదో విచిత్రమయిన అనుభూతి కలిగింది విశ్వేశ్వరయ్యగారికి.

"దీన్నేనేమో రాజారావుగారు శాంతి అన్నది" అనుకున్నారాయన.

ఆరోజుసాయంత్రం వారుకలుసుకున్నప్పుడు రాజారావుగారు విశ్వేశ్వరయ్యగారి చేయి పట్టుకుని.

"ఇదే వీడ్కోలు. రేపు నేను వెళ్ళిపోతున్నా. దుర్గం వేపుకువస్తే మా యింటికి తప్పక రావాలి." అన్నారు.

ఎప్పుడు విచారపడని విశ్వేశ్వరయ్యగారికి ఈ నాలుగురోజుల పరిచయంతో ఏర్పడిన ఆత్మీయత బాధపడేలా చేసింది.

ఆ మరుసటిరోజు లలితమ్మ స్టౌముందు కూర్చుని చలికాచుకుంటూ ఉండగానే బయట ఏదో కలకలం వినిపించి కిటికీలోంచి తొంగి చూశారు.

"ఏమిటయింది'" అనడిగారు విశ్వేశ్వరయ్య.

"తెలీదు, ఆ చివరిగదిలోని వారికి ఏదో అయిందట. డాక్టర్ వచ్చారు."

ఆమాట వినగానేహడావుడిగా లేచారు విశ్వేశ్వరయ్య మొహంకూ నీళ్ళతోకడుక్కుని. చెప్పులు కూడా వేసుకోకుండా అటువరుగెత్తారు. ఏదో అశుభాన్ని ఊహించి కలవరపడ్డారాయన.

ఆయన అంతమంది మనుష్యులు మూగి ఉన్న ఆ గదివద్దకు వచ్చేసరికి డాక్టర్

"దయచేసి అందరూ వెళ్ళిపోండి. ఎందుకిలా అడ్డునిలుస్తారు?" అంటూండటం వినపడింది.

విశ్వేశ్వరయ్యగారు తలుపుదగ్గర నిలబడి తొంగిచూశారు. పక్కమీద కళ్ళుమూసుకుని పడుకున్నారు. మెడవరకు తెల్లటిదుప్పటికప్పారు. ఒక్కమారు తాను నిల్చున్న భూమి కదిలినట్టయింది. కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి, కంఠం గద్గదమయింది.

"ఏమిటయింది డాక్టరుగారూ?" జనంలో ఎవరో అడిగారు.

"హార్ట్ ఫైల్యూర్‌లా ఉంది. రాత్రినిద్రలోనే చనిపోయి ఉండాలి. పోలీసులకు కబురంపండి. ఇంటివారికి టెలిగ్రాం పంపండి. మొత్తానికి ఇదో గొడవ."

విశ్వేశ్వరయ్యగారికి రాజారావుగారి కాళ్ళు పట్టుకుని నమస్కరించాలనిపించింది. కాని అడుగు ముందుకు పడలేదు. భయం, విచారం కలవరం వీటితో హృదయం గడ్డకట్టి. అయితే విన్ననే ఈ విషయం ఆయనకు తెలుసునా? అని ప్రశ్నించింది.

ఈ దెబ్బతో విశ్చేష్టితులయిన ఆయన యాంత్రికంగా గదిచేరుకున్నారు. జరిగిందంతా విన్న లలితమ్మ "అయ్యోపాపం" అని కళ్ళు తుడుచుకున్నారు.

భార్య ఇచ్చిన కాఫీకూడా రుచించక విశ్వేశ్వరయ్యగారు ఒంటరిగా ఆ రాతి బెంచీ వేపు వెళ్ళారు. అక్కడ కూర్చుని పడమటి దిక్కును అలానే చూస్తూ కూర్చున్నారు. పక్కనే రాజారావుగారు కూర్చుని మాట్లాడినట్లనిపించింది. చటుక్కున అటుతిరిగిచూసిన ఆయనకు ఖాళీగా ఉన్న చోటు వెక్కిరించినట్టుగా అనిపించింది. మొహం కప్పుకుని నీరసంగా రోదించారు.

"మీరిక్కడ చనిపోవాలా రాజారావుగారూ, అందులోనూ ఇలా, ఒంటరిగా, అనుకున్నారు. "మనస్సుకు శాంతి దొరికింది" అని ఆయనన్న దాని భావం, జీవితకాలం అయిపోతోందన్నదాని సూచనా? ఎంత కష్టాలనుభవించారాయన. జీవితం పొడుగూతా మృత్యుమాలనే ధరించినా ఎంతటి ధీమంతజీవితం గడిపారాయన. ఎప్పుడూ చిరునవ్వునవ్వే మొహం, కాంతిని విరజిమ్మే కళ్ళు. నక్షత్రాల్లా. చక్కగా విరిసిన పూలలా పసిపి జీవితమే చాలా చిన్నది. ఉన్నన్ని రోజుల్లో ఈ రోషాలూ, పట్టుదలూ ఎందుకు? కోపతాపాలెందుకు? తనవారు, పరాయివారు అందరికీ మంచి చేయాలన్న పట్టుదల ఎందుకు రాకూడదు?

లలిత, తనకోసమే జీవించింది. కాని నేనామెకి తిరిగి ఇచ్చిందేమిటి? ఒక చిరునవ్వా, ఓ మంచిమాటా? ఎప్పుడూ చిటపటమనే తిట్లే లేదు లలితా, ఇక నేను బ్రతికుండేరోజులే కొద్ది. అందులో ఏమయినా మంచిపని చేద్దామని ఆశగా ఉంది. నాగరాజూ, నీ కుద్యోగం దొరకలేదు. ఉట్టి పనికిరానివాడివని ఎన్ని మార్లో తిట్టాను. దానిలో నీ తప్పేముంది? దొరికే కాలానికి దొరుకుతుంది, అంతవరకూ ఎలాగోలా కాలం గడపాలంతే. కష్టాల్ని నవ్వుతూ ఎదిరించకపోతే మనం మనుష్యులం పుట్టి ఏం ప్రయోజనం? అంబికా నువ్వు అంతే, నిన్నో ఇంటిదాన్ని చేసే బాధ్యత నాది.

గాలి కొంచెం వేగంగా వీచసాగింది. పక్షులు కలకలా రావంచేస్తూ గుంపులు గుంపులుగా ఎగిరిపోతున్నాయి, ఎండ ఆయనమీద పడసాగింది. మైదానంమీది ఇంటిపొదనుండి వస్తున్న పొగ మరిదేనికో సంకేతంగా అనిపించిందాయనకు.

గదికి రాగానే ఆయన భార్యతో, "రేపే ఇక్కడినుండి వెళ్ళిపోదాం లలితా" అన్నారు.

"ఇంత తొందరగానా, ఇంకా వారంకూడా కాలా."

"ఇక ఇక్కడుండలేను నేను."

భర్త రాజారావుగారి చావునే తల్చుకుని బాధపడుతున్నారని ఊహించిన లలితమ్మ.

అందరం ఏదో రోజున చావవలసిన వాళ్ళమే కదండీ? దాని గురించెందుకు బెంగపెట్టుకున్నారు? మీ ఆరోగ్యం అన్నిటికన్న ముఖ్యం. ఓ రెండువారాలయినా గిరిధామంలో ఉండాలని చెప్పారే డాక్టరుగారు."

"నా ఆరోగ్యం బాగుపడిపోయింది లలితా. మన సామాన్లన్నీ సర్దేయి. రేపు ఉదయం బస్సులో నగరానికి వెళ్ళిపోదాం."

ఆ రోజు మధ్యాహ్నానికి రాజారావుగారి అన్న కొడుకువచ్చి శవాన్ని తీసుకుని వెళ్ళిపోయాడు. విశ్వేశ్వరయ్యగారు చెట్టునీడలో ఒహాటే పచార్లు చేశారు. ఇక అలసిపోయాక "కృష్ణావతారం" పుస్తకాన్ని తీసుకున్నాక దానిలోనే మునిగిపోయేరు.

• • •

బస్సు కిందికి దిగనారంభించింది. వంకర్లటింకర రోడ్డు. పక్కలనుండి ఎదుగుతున్న యూకలిప్టస్ చెట్లు, పచ్చటి ఆకులతో నిండుగావున్న చెట్లు వింజామరలు వీస్తున్నాయి. కిందనున్న పల్లెలు, పొలాలు అడుకునే బొమ్మల్లా కనిపిస్తున్నాయి.

"ఎంత బావుందండీ" అని లలితమ్మ అన్నప్పుడు విశ్వేశ్వరయ్యగారు చిన్నగా నవ్వారు.

"ఊరికివెళ్ళగానే అంబిక పెళ్ళిసంబంధాలు మొదలుపెట్టాలి." అని ఆయన మెల్లిగా అనేటప్పటికి ఆశ్చర్యంతో లలితమ్మ.

"వరుడ్ని చూశారా?" అనడిగారు.

"ఆం రాజీవుడు" అని విశ్వేశ్వరయ్యగారు జవాబు చెప్పినపుడు కొండగాలి రివ్వుమని వీచి ఆయన కంఠాన్ని కొండల్లోకి తీసుకువెళ్ళి ప్రతిధ్వనింప చేసింది. ●